పార్కు స్థలం కబ్జాపై కమిషనర్‌కు ఫిర్యాదు



గతంలో పార్కు స్థలంలో మున్సిపాలిటీ అధికారులు నాటిన బోర్డు

హయత్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ సాయిప్రియాకాలనీలో 12వందల గజాల పార్కు స్థలం కబ్జాకు గురవుతున్నదని గ్రామానికి చెందిన మల్లెల జగదీశ్వర్ శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో మున్సిపాలిటీ అధికారులు ఈస్థలం మున్సిపాలిటీకి సంబంధించినదని నాటిన సూచిక బోర్డులను తొలగించి కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. కోట్ల విలువ చేసే ఈ పార్కు స్థలాన్ని కాపాడాలని కోరారు. బోర్డును తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. త్వరలో జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

చెరువులను రక్షించాలని తహసీల్దార్‌కు వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం గ్రామంలో కబ్జాలకు గురవుతున్న చెరువులను రక్షించాలని కోరుతూ సీపీఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తట్టిఖానా చెరువు సర్వే నంబర్-1లో రియల్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వ్యాపారులతో చేతులు కలిపే అధికారులు కబ్జాల జోలికి వెళ్లడం లేదని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి తట్టిఖానా చెరువును రక్షించాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

శానిటేషన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

చాదర్‌ఘాట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శనివారం మూసారాంబాగ్ డివిజన్‌లో చెత్తకుప్పలను, మట్టికుప్పలను, ఇతర వ్యర్థాలను తొలగించే పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి పరిశీలించారు. స్వచ్ఛదనం- పచ్చదనం బాధ్యత ప్రతి ఒక్కరిదని, స్థానిక ప్రజలు బాధ్యతగా నిర్వహించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో చేయూత నివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాలనీలో పేరుకుపోతున్న మట్టికుప్పలను, చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ జీహెచ్ఎంసీ శానిటేషన్ ఎస్ఎఫ్ఏ ముజీబ్‌కు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఏఈ సాయి, మల్లికార్జున్, ఏడుకొండలు, మధు, నరేందర్, అపర్ణ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం నేతలు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

సైదాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ జేఏసీ నేతలు శనివారం సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. సుమారు 30ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని పేర్కొన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో అఖిల పక్షం నేతలు శంకర్‌నాయక్, దాసు, విక్రం, మహమూద్, సద్దాం, విజయ్, అంజయ్య, సక్రీబాయి. నర్సింగ్, నాగరాజు పాల్గొన్నారు.

పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్

కొత్తపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో గౌడ్స్‌కాలనీ, మారుతీనగర్, న్యూ మారుతీనగర్, సత్యానగర్, కొత్తపేట ఓల్డ్ విలేజీ, భరత్ నగర్‌లలో పాడైన రోడ్లకు మరమ్మతు పనులకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు విన్నవించారు. శనివారం ఆయన కమిషనర్‌ను కలిసి ఆగిన అభివృద్ధి పనులతో డివిజన్‌లో నెలకొన్న సమస్యలను గుర్తుచేశారు. బాక్స్‌డ్రెయిన్ పనులు త్వరగా పూర్తిచేయాలని, ఆ తర్వాత జలమండలి పైప్‌లైన్ పనులతో పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలకు పనులు చేపట్టి దారుల్లో వరదనీరు చేరుతోందని వాహన ప్రయాణం, కాలినడక సైతం ప్రమాదకరంగా మారిందని విన్నవించారు. నూతన సీసీరోడ్లు నిర్మించాలని కోరారు.

ఎల్బీనగర్‌లో ఆర్టీసీ నూతన కార్గో పాయింట్



టీజీఎస్ ఆర్టీసీ నూతన కార్గో పాయింట్‌ను ప్రారంభించిన ఆర్టీసీ కార్గో పాయింట్ డిప్యూటీ సీటీఎం మధుసూదన్, వెంకట్‌నారాయణ

ఎల్బీనగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ చౌరస్తా(జిల్లా బస్సు సర్వీసులు నిలిపే అలైటింగ్ పాయింట్) వద్ద నూతన కార్గో పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ డిప్యూటీ సీటీఎం మధుసూదన్ తెలిపారు. శనివారం ఎల్బీనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్గో పాయింట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ, మిర్యాలగూడ, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, మధిర, పాల్వంచ, ఇల్లందు, సూర్యాపేట, కోదాడ, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, గుంటూరు ప్రాంతాలకు ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, కర్మన్‌ఘాట్, ఉప్పల్ ప్రాంతాల వారు పార్సిల్ బుక్ చేయాలనుకుంటే ఎంజీబీఎస్‌కు వెళ్లకుండా ఎల్బీనగర్‌లోనే బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం(జీహెచ్‌జడ్) వెంకట్‌నారాయణ, ప్రదీప్, అమరేందర్‌రాజు, సతీష్, సత్యనారాయణ, మురళీధర్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.



వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న యశోద ఆస్పత్రి డాక్టర్లు



ఓపీ వైద్యసేవలు నిలిపి నిరసన తెలుపుతున్న ఓజోన్ వైద్య సిబ్బంది



హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగులు లేకపోవడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేత

- మానవతా హృదయంతో నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు అందించిన వైద్యులు

సైదాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలోని ఆర్జీకర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం మలక్‌పేట, వనస్థలిపురం, ఎల్బీనగర్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర వైద్యసిబ్బంది అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ వైద్యసేవలు నిలిపివేశారు. కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, దారుణ హత్యను నిరసిస్తూ రెండో రోజు శనివారం మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిపివేశారు. విధులు బహిష్కరించి డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిపివేయగా 24గంటల పాటు ఎమర్జెన్సీ చికిత్సలు మాత్రం కొనసాగుతోంది.

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో..

వనస్థలిపురం : మెడికల్ కళాశాల పీజీ వైద్యురాలి హత్యను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ), ఐడీఏ, ఎస్ఆర్‌డీఏ సంఘాల సమ్మెకు మద్దతుగా వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఓపి సేవలను నిలిపివేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రోగుల ఇబ్బందులను గుర్తించిన



మలక్‌పేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు

వైద్యులు మానవతా దృక్పథంతో తిరిగి ఓపి వైద్య సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ, శాంతికుమార్, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో..

మన్సూరాబాద్‌లోని నర్సింగ్ కళాశాల విద్యార్థులు కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. నర్సింగ్ విద్యార్థులు చేపడుతున్న నిరసనకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మద్దతు ప్రకటించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన సంఘటనకు తక్షణమే సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వనస్థలిపురంలోని ప్రగ్మా ఆస్పత్రి, బీఎన్‌రెడ్డి నగర్‌లోని బృంగి ఆస్పత్రి, ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రుల్లో వైద్యులు ఓపి సేవలను నిలిపివేశారు. దీంతో ఆస్పత్రులకు కొత్తగా వచ్చిన రోగులు ఓపి సేవలు నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ..

హయత్‌నగర్: అత్యాచార ఘటనకు నిరసనగా ఐఎంఏ పిలుపు మేరకు హయత్‌నగర్ పరిధిలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలను నిలిపివేశారు. అత్యవసర సేవలను మాత్రం కొనసాగించారు. ఓపీ సేవలు నిలిపివేయడంతో ఆస్పత్రులకు వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. అయితే అక్కడక్కడ కొన్ని ఆస్పత్రుల్లో ఓపీ సేవలను అందించారు. దీంతో రోగులు ఆర్ఎంపీ క్లినిక్‌లకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్‌లోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలను నిలిపివేశారు. కొన్ని ఆస్పత్రుల్లో అత్యవసర సేవలతో పాటు ఓపీ సేవలను కొనసాగించారు.

ఓజోన్ వైద్య సిబ్బంది..

ఎల్బీనగర్ : ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని ఓజోన్ ఆస్పత్రిలో ఓపీ వైద్య సేవలు నిలిపివేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. వైద్యవిద్యార్థిపై హత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆస్పత్రి సీఈఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, జూనియర్ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై కొవ్వొత్తుల ప్రదర్శనలో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

యశోద ఆస్పత్రి వైద్యుల విధుల బహిష్కరణ

ఓల్డ్‌మలక్‌పేట: మలక్‌పేటలోని యశోద ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్లు ఓపీ వైద్య చికిత్సలు బంద్‌చేసి విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డా.ఎ లింగయ్య మాట్లాడుతూ కోల్‌కత్తాలో మహిళా డాక్టర్ సంఘటన వైద్య లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఇది చాలా బాధాకరమైన విషయం ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో..

ఓల్డ్ మలక్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కోల్‌కత్తా లాంటి సంగటన మరెక్కడా జరుగకుండా చూడాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా డాక్టర్లు డిమాండ్ చేశారు.

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై కొవ్వొత్తులతో ర్యాలీ

ఎల్బీనగర్ : కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై వైద్యవిద్యార్థులు, డాక్టర్లతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారం ధారుణమన్నారు. తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పల్సమ్ శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణ్‌కుమార్, ఆర్మీ శ్రీధర్, నరేందర్, జైపాల్‌రెడ్డి, శివగౌడ్, విష్ణు, గౌస్, నరేష్, వరలక్ష్మి, అనసూయ, వెంకట్, రాజు, భాను పాల్గొన్నారు.

కోదండరామ్‌కు హార్డ్‌వేర్ పార్క్ జేఏసీ శుభాకాంక్షలు



కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జేఏసీ ప్రతినిధులు

సరూర్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను శనివారం నాదర్‌గుల్, ఆదిభట్ల, ఎం.ఎం.కుంట ప్రాంతాల హార్డ్‌వేర్ పార్క్ భూబాధితుల జేఏసీ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయనను శాలువాతో సత్కరించి, బొకే అందజేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసింది. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రకు ఇన్నాళ్లకు న్యాయం జరిగినట్టయిందని ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు మాధవరం రామేశ్వరరావు, దార సత్యం, కందాడి శ్రీరాంరెడ్డి, కళ్లెం చంద్రారెడ్డి, ముద్దం వెంకట్‌రెడ్డి, జీ.హనుమంతరావు, తీగల సుభాష్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను తెలంగాణ జన సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి బొకే అందజేసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేవీ రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొత్త రవి, దొంతిరెడ్డి, మాణిక్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, నారాయణరావు, యాదయ్య, బీరకాయల మధుసూదన్ పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని ఆంజనేయ టవర్స్, చంద్రారెడ్డి కాలనీలకు అనుసంధానంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులకు శనివారం కార్పొరేటర్ పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డితో కలిసి మేయర్ చిగురింత పారిజాతా నర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో మురుగు ప్రవాహాలు లేకుండా చూసేందుకుగాను యూజీడీ నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ సాయిరామ్, నాయకులు పెద్దబావి మహేందర్‌రెడ్డి, బాబు, కాలనీ ప్రతినిధులు ధన్‌రాజ్, కృష్ణ, మౌనిక, రాంబాబు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు..

నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని బాలాజీనగర్‌కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మేయర్ పారిజాతానర్సింహారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈఈ బిక్కూనాయక్, కాలనీ అధ్యక్షుడు కొండా శ్రావణ్‌కుమార్‌యాదవ్, స్థానిక నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీ కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామకూర రాజు అధ్యక్షతన కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీలు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు గతంలో మోసం చేశాయనీ, అదే తరహాలో కాంగ్రెస్ మోసం చేస్తే సహించేది లేదన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, కదిరే కృష్ణ, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కేవి గౌడ్, శ్రీకాంత్, సిద్దేశ్వర్, రాజారాం యాదవ్, శ్యాంసుందర్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, ఎస్.బీ.ఎన్ చారి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన అవశ్యం

- మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్



మాట్లాడుతున్న మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, పక్కన ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన అవశ్యమని ఏసీపీ శ్యాంసుందర్ అన్నారు. శనివారం సాయంత్రం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డిఅన్నారం రాజీవ్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారంలో ఉన్న హాస్టల్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్తగా హాస్టల్‌కు ఎవరు వచ్చి చేరినా ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అపరిచితులైన వ్యక్తులు వచ్చి చేరినా, అడ్మిషన్ల కోసం గొడవలకు పాల్పడినా, ఎలాంటి నేరాలకు పాల్పడినట్లుగా గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల ఆర్థిక నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని అరికట్టడంలో అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మలక్‌పేట ఎస్ఐలు సురేష్, నవీన్, మైత్రీ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదింటి వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేత

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పేదింటి మహిళల వివాహాలకు సహాయం చేయడానికి తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని టీపీసీసీ ప్రచార కమిటీ కో-చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లికి చెందిన కావలి విజయలక్ష్మి లింగం దంపతుల కుమార్తె లాస్య(నందిని), సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన పొన్నం భాస్కర్ కనకవ్వ దంపతులు కుమార్తె అక్షయ వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నాగోల్‌లోని తన నివాసంలో శ్రీనివాస్‌గుప్తా పుస్తె మెట్టెలు, చీర, పసుపు, కుంకుమలను అందజేశారు. కార్యక్రమంలో సదానంద గుప్తా, యదా శ్రీనివాస్‌గుప్తా, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వరదనీటి సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వరదనీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : రాగుల

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులకు వరద నీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి వరదనీరు డ్రైనేజీలో కలవడంతో రోడ్ల పైకి వరదనీరు రావడంతో కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకపోయారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ శనివారం సంబంధిత అధికారులతో కలిసి వరదనీటి సమస్యలను పరిశీలించారు. తవ్విన గుంతలను త్వరితగతిన పూర్తిచేసి వరదనీటి సమస్యలు రాకుండా తగుచర్యలు చేపట్టాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



సర్వాయిపాపన్న జయంతి కార్యక్రమంలో నాయకులు

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గౌడ సంఘాల జేఏసీ కో-చైర్మన్, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ కూరెళ్ల వేములయ్యగౌడ్ ఆధ్వర్యంలో చింతలకుంటలోని పల్లవి గార్డెన్స్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కౌనిలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మయాదవ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, నాయకులు మొగ్గ అనిల్ కుమార్, రఘురామ్‌నేత, గౌడ సంఘం నాయకులు అంబాల మల్లేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సైదాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.5000 నగదు, 8 సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు మాదన్నపేట పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. చావునీలోని ఆర్ఆర్ రెసిడెన్సీలో యుబేదుల్లా ఖాన్ ఇంట్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారిపై గేమింగ్ యాక్ట్ చట్టం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులబాధ భరించలేక మదర్ డెయిరీ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం



ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెక్యూరిటీ గార్డు శివకుమార్

హయత్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : అప్పులబాధ భరించలేక మదర్ డెయిరీ సెక్యూరిటీ గార్డు శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు.. హయత్‌నగర్ శారదనగర్‌లో నివాసముండే పీవీజీ.శివకుమార్(51) కొంతకాలంగా హయత్‌నగర్ లోని శారద నగర్‌లో నివాసముంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె మోహనసాయికి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో శివకుమార్ ప్రైవేట్ బ్యాంకు బజాజ్ ఫైనాన్స్‌లో అప్పు చేశాడు. చిన్న కుమార్తె సాయి భార్గవి తీసుకున్న అప్పు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో మదర్ డెయిరీ ఎండీకి వీడియో కాల్‌చేసి తాను సూసైడ్ చేసుకుంటున్న అంటూ శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. వెంటనే తోటి ఉద్యోగులు శివకుమార్‌ను హయత్‌నగర్ లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం శివకుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారు. అయితే ఒక నెల జీతం రాలేదని ఆయన పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.